# ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరు కావాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం కలెక్టరేట్: మార్చి8: ప్రజాజ్యోతి:** సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు సకాలంలో హాజరుకావాలని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ప్రజలు తమ తమ సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వక ఫిర్యాదులను సమర్పించాలని సూచించారు. ఉదయం 10.30గంటలకు ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. సంబంధిత శాఖాధికారులు ప్రజల నుండి అందిన ఫిర్యాదులను వెంటనే స్వీకరించి, తగిన చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.


జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం



భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం | 9 | మార్చి | 2026 ◆ పేజీలు : 8






# భద్రాద్రి జిల్లా కేంద్రంలో సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ భవనాన్ని నిర్మిస్తాం...

- ఇల్లందు క్రాస్ రోడ్ వద్ద థాను నాయక్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తాం
- ఎమ్మెల్యే కూననేని సాంబశివరావు
- బంజారా బిడ్డను మేయర్ చేసిన ఘనత వారిదే
- మేయర్ గణేష్ చౌహన్

**కొత్తగూడెం కలెక్టరేట్ మార్చి8 ,ప్రజాజ్యోతి:** సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ చూపిన బాటలో బంజారాలు మరింత అభివృద్ధి సాధించాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆకాంక్షించారు. ఆదివారం పాల్వంచ జిల్లా కలెక్టరేట్ సమీపంలో ఏర్పాటుచేసిన సేవాలాల్ మహారాజ్ జయంతి ముగింపు వేడుకల్లో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా బంజారా సాధువులతో కలిసి భోగ్ బండారో పూజలు చేశారు. అనంతరం నూతన బంజారా కార్పొరేటర్లను, సాధువులను, బంజారా మీడియా మిత్రులకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో ఘనంగా సత్కరించారు. వారికి సేవాలాల్ మహారాజ్, థాను నాయక్ చిత్రపటాన్ని బహుకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ 97 మంది గిరిజనులను సర్పంచ్లుగా గెలిపించుకున్నామని అన్నారు. కొత్తగూడెం కార్పొరేషన్ ఏర్పాటు అయిన తొలిసారి చరిత్రలో నిలిచిపోయేలా బంజారా బిడ్డ గణేష్ చౌహన్ ను మేయర్ పీఠం ఎక్కించామని తెలిపారు. రాజకీయాల్లో తొలినాళ్ల నుంచి

మిగతా 2 లో...

# శ్రీ సీతారాముల కల్యాణం సందర్భంగా భక్తులకు అన్ని సౌకర్యాలు

## జిల్లా కలెక్టర్ అంకిత్

- మిథిలా స్టేడియంలో ఏర్పాట్ల పరిశీలన



**భద్రాచలం, మార్చి 8,ప్రజాజ్యోతి :** ఈ నెల 27, 28 తేదీలలో భద్రాచలంలో జరగనున్న శ్రీ సీతారామచంద్ర స్వామివారి కల్యాణ మహోత్సవం మరియు పట్టాభిషేక వేడుకలను తిలకించేందుకు వివిధ రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశముందని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఆదివారం శ్రీ సీతారామచంద్ర స్వామివారిని దర్శించుకున్న అనంతరం మిథిలా స్టేడియంలో జరుగుతున్న కల్యాణ ఏర్పాట్ల పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవికాలాన్ని దృష్టిలో పెట్టుకొని భక్తులకు చలువ పందిళ్లు, తాగునీటి సౌకర్యం, విశ్రాంతి కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కల్యాణ మండపంలోనూ, బయట ఉండే భక్తుల కోసం

మిగతా 2 లో...

# ఘనంగా గోదావరి హారతి : ఈవో దామోదర్ రావు



**భద్రాచలం, మార్చి 8,ప్రజాజ్యోతి :** భద్రాచలం దివ్యక్షేత్రంలోని పుణ్య గోదావరి స్నానఘట్టాల వద్ద నిర్వహిస్తున్న గోదావరి హారతికి పాల్గుణ బహుళ పంచమి మాసం ప్రారంభమవడంతో భక్తుల సంఖ్య మరింత పెరుగుతుందని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం ఈవో దామోదర్ రావు తెలిపారు. ఆదివారం సాయంత్రం భద్రాచలంలోని గోదావరి కరకట్ట వద్ద నిర్వహించిన నదీహారతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ పాల్గుణ మాసం అత్యంత పుణ్యప్రదమైనదని, ఈ మాసంలో నిర్వహించే గోదావరి హారతికి

మిగతా 2 లో...

# పోడు సాగుదారులపై నిర్బంధాలు వద్దు

- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు
- పేదల సాగుభూములను స్వాధీనం చేసుకోవద్దని అటవీశాఖకు సూచన



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి ,మార్చి 8,ప్రజాజ్యోతి :** పోడు సాగుదారులపై నిర్బంధ చర్యలు చేపట్టకూడదని, అనాదిగా సాగు చేస్తున్న పోడు భూములను స్వాధీనం చేసుకునే చర్యలకు స్వస్తి చెప్పాలని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అటవీశాఖ అధికారులను కోరారు. లక్ష్మీదేవిపల్లి మండల పరిధిలోని జిల్లా అటవీశాఖ అధికారి కార్యాలయంలో అటవీశాఖ అధికారులు, స్థానిక నాయకులు, పోడు రైతులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో, ముఖ్యంగా కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలో ఏళ్లుగా

మిగతా 2 లో...

## పోడు సాగుదారులపై నిర్బంధాలు వద్దు

(మొదటి పేజీ తరువాయి...)

పోడు భూములను ఆధారంగా చేసుకుని జీవిస్తున్న గిరిజనులను ఇబ్బందులకు గురి చేయొద్దని అన్నారు. పేద గిరిజనులు సాగు చేస్తున్న భూములను స్వాధీనం చేసుకోవడం వల్ల వారి జీవనోపాధి దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే సాగులో ఉన్న భూముల్లో కందకాలు తవ్వడం, మొక్కలు నాటడం వంటి చర్యలు గిరిజనులకు తీవ్ర నష్టం కలిగిస్తాయని పేర్కొన్నారు. అయితే కొత్తగా అటవీ భూములు ఆక్రమణకు గురికాకుండా అటవీశాఖ తీసుకునే చర్యలకు తాము పూర్తిస్థాయిలో సహకరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. అడవుల సంరక్షణ ఎంత ముఖ్యమో, పేదవాడి కడుపు నిండడం కూడా అంతే ముఖ్యమని ఆయన అన్నారు.గిరిజన ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, తాగునీటి పథకాలు, గ్రామీణ రహదారుల వంటి అభివృద్ధి పనులకు అటవీ శాఖ అడ్డంకులు సృష్టించకుండా సహకరించాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం అవసరమైన ఫారెస్ట్ క్లియరెన్స్ త్వరితగతిన మంజూరు చేయాలని సూచించారు. అటవీ సంరక్షణతో పాటు గిరిజనుల సంక్షేమం కూడా సమతుల్యంగా కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు.ఈ సమావేశంలో ఎఫ్‌డీవో బాబు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కే. సాబీర్ పాషా, కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, రాష్ట్ర రైతు సంఘం నాయకులు ముత్యాల విశ్వనాథం, సీపీఐ మండల కార్యదర్శి దీటి లక్ష్మీపతి, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సీతారాముల కల్యాణం సందర్భంగా భక్తులకు అన్ని సౌకర్యాలు



(మొదటి పేజీ తరువాయి...)

ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా పాలీహౌస్‌లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. దేవస్థానం పరిధిలోని ఎక్కువ భాగం పనులు ఇప్పటికే పూర్తయ్యాయని, మిగిలిన ఏర్పాట్ల కోసం ప్రత్యేక అధికారులను నియమించి పనులను వేగంగా పూర్తి చేస్తున్నామని వెల్లడించారు. భద్రాచలం చేరుకునే భక్తులు కల్యాణ మండపానికి సులభంగా చేరుకునే విధంగా ప్రధాన కూడళ్లలో ఫ్లెక్సీలు, రూట్ మ్యాప్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులందరికీ స్వామి వారి తలంబ్రాలు, ప్రసాదాలు అందేలా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. వేసవికాలం నేపథ్యంలో భక్తులు బస చేసే ప్రాంతాల నుంచి కల్యాణ మండపానికి రవాణా సౌకర్యం కల్పించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. భక్తులు అధికారులు ఇచ్చే సూచనలను పాటిస్తూ స్వామివారి కల్యాణం, పట్టాభిషేకాన్ని కనులారా తిలకించి సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవాలని కోరారు. అలాగే భక్తుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఫుడ్ సేఫ్టీ అధికారులతో ప్రత్యేక తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎక్కడపడితే అక్కడ తినుబండారాలు తీసుకోవద్దని, పరిశుభ్రత పాటించాలని భక్తులకు సూచించారు. సబ్ కలెక్టర్ మ్రిణాల్ శ్రేష్ఠ, దేవస్థానం ఈవో దామోదర్ రావు, దేవస్థానం డీఈ రవీందర్, తహసీల్దార్ ధనియాల వెంకటేశ్వర్లు, గ్రామపంచాయతీ ఈవో శ్రీనివాసరావు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా గోదావరి హారతి

(మొదటి పేజీ తరువాయి...)

ప్రత్యేకమైన ఆధ్యాత్మిక ప్రాధాన్యం ఉందని పేర్కొన్నారు. అనంతరం రామవజల రవికుమార్ ఆధ్వర్యంలో పురోహితులు గోదావరి హారతి విశిష్టతను, పాల్గుణ పంచమి మాస ప్రాముఖ్యతను భక్తులకు వివరించారు. కార్యక్రమంలో భాగంగా గణపతి పూజ, దీపోత్సవం నిర్వహించి భక్తుల చేత గోదావరి నదికి పూజలు చేయించారు. పూజా ద్రవ్యాలతో గోదావరి నదికి అష్టోత్తర శతనామార్చన నిర్వహించి లోకక్షేమార్థం ప్రార్థనలు చేశారు.ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న ఈ నదీహారతి కార్యక్రమంలో గ్రామస్థులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీరామచంద్ర స్వామివారి అనుగ్రహంతో గోదావరి మాత ఆశీస్సులు పొందుతున్నారని తెలిపారు. అనంతరం శాంతి మంత్ర పఠనం నిర్వహించారు. విశాఖపట్నానికి చెందిన హరిత–రామ్మోహన్ దంపతులు భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. నదీహారతి కార్యక్రమానికి అవసరమైన పూజా సామాగ్రిని భద్రాచలం రెడీమేడ్ బట్టల షాపుల అసోసియేషన్ అందించింది. ఈ కార్యక్రమంలో దేవస్థానం డీఈ రవీందర్, తహసీల్దార్ ధనియాల వెంకటేశ్వర్లు, పురోహితులు సురేష్ శర్మ, అశోక్ కుమార్ శర్మ, వీరభద్ర శర్మ, రామాచార్యులు, ప్రసాద్ శర్మ, ఫణికుమార్ శర్మ, కృష్ణ శర్మ, తేజ శర్మ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# భద్రాద్రి జిల్లా కేంద్రంలో సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ భవనాన్ని నిర్మిస్తాం...

(మొదటి పేజీ తరువాయి...)

లంబాడి సోదరులతో అవినాభావ సంబంధం ఉందని అన్నారు, అనంతరం కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ మాట్లాడుతూ నేడు సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జరుపుకోవడానికి కుల సంఘ నాయకుల పోరాటమే కారణమని చెప్పారు. జాతి హక్కుల సాధన కోసం వారు నిరంతరాయంగా పోరాటం చేస్తున్నారని కొనియాడారు. బంజారా కుల సంఘాల నాయకులకు ధర్మాన్ని కాపాడుతున్న సాధువులకు కృతజ్ఞతలు చెప్పారు. కొత్తగూడెం కార్పొరేషన్ తొలి మేయర్ పీఠాన్ని మారుమూల ప్రాంతం నుంచి వచ్చిన తనను నియమించినందుకు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి షాబీర్ పాషాలకు ప్రత్యేక కృతజ్ఞతలు చెప్పారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే షాబీర్ పాషా మాట్లాడుతూ సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ భవన నిర్మాణానికి 8 ప్రదేశాలను ఎమ్మెల్యే ఎంపిక చేశారని చెప్పారు. బంజారా కుల సంఘ పెద్దలు



తీర్మానించి ఒక ప్రదేశాన్ని ఎంపిక చేసుకుంటే ఎమ్మెల్యే ఆధ్వర్యంలో బంజారా భవన నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. ఇప్పటికే బంజారా భవన నిర్మాణానికి రూ.25 లక్షలు మంజూరు అయ్యాయని, భవన నిర్మాణానికి మరింత నిధులు తెచ్చేందుకు ఎమ్మెల్యే కృత నిశ్చయంతో ఉన్నారని స్పష్టం చేశారు. సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ బంజారా జాతి ఐక్యత కోసం చేసిన సేవలను నెమరు వేసుకున్నారు. బంజారా సోదరులతో వారికి ఉన్న సంబంధాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం రమేష్ రాథోడ్ మాట్లాడుతూ కుల సంఘాల పోరాటంతో రాష్ట్ర వ్యాప్తంగా అధికారికంగా సేవాలాల్ జయంతి జరుగుతుందని, అలాగే ఆహారం, ఆహార్యం గురించీ ప్రస్తావించారు, జేఏసీ ఆధ్వర్యంలో బానోత్ వీరు నాయక్. కాన్షిరాం, భద్రు గుగులోత్, భరత్ నాయక్. ధర్మాసోత్ ఉపేందర్, కుశ నాయక్,రమేష్ నాయక్ ,లావుడియా ప్రసాద్ నాయక్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు,అనంతరం బంజారా కార్పొరేట్లకు,విలేకరులకు,సంత్ సాధువులకు బంజారా కుల సంఘ నాయకులకు కార్యక్రమం నిర్వహించిన నునావత్ రవి,విశ్వ మిత్ర చౌహన్.బాలు.స్థానిక కార్పొరేటర్ దినేష్ శ్యామల సాధువులు అంశాలను సన్మానం చేశారు,భద్రాద్రి జిల్లాలో గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో దిప్యూటీ మేయర్ లలిత కుమారి, తహసీల్దార్ గన్యా నాయక్. పుల్ల రావు, దారా ప్రసాద్,సింధు తపస్వి, కేత వత్ స్వప్న, డాక్టర్ బీయస్ రావు,జేఏసీ వైస్ చైర్మన్ వీరు నాయక్, , అడ్వకేట్ రమేష్ నాయక్, సేవాలాల్ బంజారా సంఘం లావుడియా ప్రసాద్ నాయక్, ఏజెన్సీ పరిరక్షణ కమిటీ అధ్యక్షులు లాల్ సింగ్ నాయక్, ఉపాధ్యాయుల సంఘం నాయకులు లక్ష్మణ్ నాయక్, బానోత్ రాములు నాయక్, బాబూలాల్ నాయక్,సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షులు చందర్ నాయక్,గుగులోత్ భద్రు. అనిల్ నాయక్,దేవీలాల్,గోర్ బంజారా పోరాట సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షులు దుర్గాప్రసాద్,శంకర్ సాదు, గణేష్ మహారాజ్, బానోత్ భోజ్య నాయక్,సురేష్ నాయక్. మోహన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు,

## భద్రాచలంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

- మార్చి 9న కంటి పరీక్షలు
- క్యాటరాక్ట్ రోగులకు ఉచిత ఆపరేషన్ సౌకర్యం



**భద్రాచలం, మార్చి 8,ప్రజాజ్యోతి :** భద్రాచలం పట్టణంలోని పాత ఎల్ఐసి కార్యాలయం ఎదురుగా ఉన్న ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ భద్రాచలం డివిజన్ కార్యాలయంలో ఈ నెల 9వ తేదీ (సోమవారం) ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సంఘం నాయకులు తెలిపారు.వరంగల్ శరత్ మాక్సిజన్ కంటి ఆసుపత్రి వైద్యుల ఆధ్వర్యంలో నిర్వహించే ఈ శిబిరంలో హెల్త్ కార్డు కలిగిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విశ్రాంత ఉద్యోగులు, జర్నలిస్టులు, పోలీసు శాఖ సిబ్బందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహిస్తారు. క్యాటరాక్ట్ (ముత్యబిందు) ఉన్న రోగులను అదే రోజు వారి సొంత వాహనాల్లో వరంగల్‌కు తీసుకెళ్లి ఉచితంగా ఆపరేషన్ చేసి తిరిగి భద్రాచలానికి తీసుకువస్తారు.ఆపరేషన్ చేయించుకునే వారికి ఉచిత మందులు, రవాణా సౌకర్యం మరియు భోజన వసతి కల్పించనున్నట్లు తెలిపారు. అలాగే తెల్ల రేషన్ కార్డు కలిగిన వారికి కూడా ఉచిత కంటి పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ శిబిరం సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కొనసాగుతుంది. శిబిరానికి వచ్చే వారు హెల్త్ కార్డు తప్పనిసరిగా తీసుకురావాలని ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ భద్రాచలం డివిజన్ అధ్యక్షులు బందు వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎల్.వి. ప్రసాద్, కోశాధికారి డి. కృష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు.ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు చంద్ర సుబ్బయ్య చౌదరి, ఎస్. రాజబాబు, టి. శివప్రసాద్, సంఘం సలహాదారు మాదిరెడ్డి రామ్మోహనరావు, దుర్గాప్రసాద్, నాళం సత్యనారాయణ, జి. మురళీకృష్ణ, పంపన సత్యనారాయణ, విష్ణు మొలకల సుబ్రహ్మణ్యం, వీ. రాంబాబు, చుక్కా రాంబాబు, ఐ.వి. సత్యనారాయణ, వీరభద్రరావు, అక్కయ్య, బైరు నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సాధికారతతోనే సమాజ అభివృద్ధి: ఎస్పీ రోహిత్ రాజు

- జిల్లా పోలీసు శాఖలో మహిళా అధికారులు, సిబ్బంది సేవలు అభినందనీయం



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మహిళామణులకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. పోలీస్ శాఖలో పురుషులతో సమానంగా విధులు నిర్వర్తిస్తూ మహిళా అధికారులు, సిబ్బంది సమర్థవంతంగా తమ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారని ఆయన తెలిపారు. కుటుంబ బాధ్యతలతో పాటు విధి నిర్వహణలోనూ నిబద్ధతతో పనిచేస్తూ ప్రజలకు సేవలు అందిస్తున్న మహిళా పోలీసులకు ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు.

**సబ్ డివిజన్ ల వారీగా సన్మానాలు**

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా ఎస్పీ సూచనల మేరకు వివిధ సబ్ డివిజన్ లలో మహిళా పోలీసు అధికారులను, సిబ్బందిని ఘనంగా సన్మానించారు. భద్రాచలం సబ్ డివిజన్ లో పోలీస్ శాఖలో పని చేస్తున్న మహిళా అధికారులు, సిబ్బందిని ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ తన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు. కొత్తగూడెంలోని ఐఎంఏ ఫంక్షన్ హాల్ లో డీఎస్పీ ఆదినారాయణ ఆధ్వర్యంలో సబ్ డివిజన్ పరిధిలోని మహిళా పోలీసు అధికారులు, సిబ్బందిని సన్మానించారు. అలాగే పాల్వంచ సబ్ డివిజన్ లో డీఎస్పీ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో మహిళా పోలీసు అధికారులను డీఎస్పీ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణపై అవగాహన పెంచాలి

- **స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన**





**కొత్తగూడెం కలెక్టరేట్: మార్చి8:ప్రజా జ్యోతి** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా అమలు చేస్తున్న 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో గ్రామీణ ప్రాంతాల్లో పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ వ్యర్థాల నిర్వహణపై ప్రజల్లో విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన కోరారు, ఆదివారం చుంచుపల్లి మండలం నందతండా గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ యూనిట్‌ను సందర్శించి అక్కడ నిర్వహిస్తున్న సక్రమంగా సేకరించి శుద్ధి చేసి వినియోగించే విధానంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామపంచాయతీ స్థాయిలో వ్యర్థాల వర్గీకరణ, సేకరణ, నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం సుజాతనగర్ మండలం సీతంపేట బంజారా గ్రామపంచాయతీలో స్వయం సహాయక సంఘాల మహిళలు, గ్రామస్థులతో అవగాహన సమావేశం లో మాట్లాడారు ప్రతి ఇంటిలో తడి వ్యర్థాలు , పొడి వ్యర్థాలు వేర్వేరుగా వర్గీకరించి ఇవ్వడం ద్వారా గ్రామాలు పరిశుభ్రంగా ఉండటానికి సహకరించాలని ప్రజలకు సూచించారు. వ్యర్థాలను సరైన విధంగా వేరు చేయడం వల్ల పర్యావరణ పరిరక్షణతో పాటు ఆరోగ్యకరమైన జీవన విధానం సాధ్యమవుతుందని తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళలు గ్రామ స్థాయిలో పరిశుభ్రత కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించాలని ఆమె కోరారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, వ్యర్థాలను సరైన పద్ధతిలో నిర్వహించడం ద్వారా గ్రామాలను పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా మార్చుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌పీఓ, స్వచ్ఛ భారత్ మిషన్ కన్సల్టెంట్, సంబంధిత ఎంపీడీవోలు, గ్రామ సర్పంచులు, స్వయం సహాయక సంఘాల మహిళలు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

## హెచ్పీవీ వ్యాక్సిన్ ప్రారంభించిన సర్పంచ్



**బూర్గంపహాడ్, మార్చి 8 (ప్రజా జ్యోతి ):** బూర్గంపహాడ్ సామాజిక ఆరోగ్యకేంద్రంలో హెచ్పీవీ వ్యాక్సిన్ ఆదివారం సర్పంచ్ మందా నాగరాజు లాంఛనంగా ప్రారంభించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ ముక్కంటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 14 ఏళ్లు దాటిన ఆడపిల్లలకు ఈ వ్యాక్సిన్ను వేసే కార్యక్రమం చేపట్టినట్లు ప్రతి ఆడపిల్ల ఈ వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణ కోసం ఈ వ్యాక్సిన్ వేయించుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తెలిపాయని, ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపి పాఠశాలలు, హాస్టళ్లలో ఉన్న 14 ఏళ్లు దాటిన ఆడపిల్లలు వ్యాక్సిన్ వేయించుకునేలా చూడాలన్నారు. ఇప్పటికే ఈ వ్యాక్సిన్పై మండలంలో ప్రచారం చేయడం జరిగిందని, అందులో భాగంగా 564 మందిని గుర్తించడం జరిగిందని తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వ్యాక్సినేషన్ కార్యక్రమం ఉంటుందని సూపరింటెండెంట్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జమలారెడ్డి, ఎంఈవో యదుసింహరాజు, సీడీపీవో రేవతి, ఉపసర్పంచ్ గుండె వెంకన్న, హెచ్ఐవో రవి, సీహెచ్వి విజయ, వైద్యసిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## రామయ్య ను దర్శించుకున్న జిల్లా కలెక్టర్ అంకిత్



**భద్రాచలం, మార్చి 8,ప్రజాజ్యోతి :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామివారిని ఆదివారం దర్శించుకున్నారు.స్వామివారి దర్శనానికి వచ్చిన కలెక్టర్‌కు దేవస్థానం ఈవో దామోదర్ రావు, అర్చక స్వాములు దేవస్థానం సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు. ముందుగా బలపీఠం వద్ద పూజలు నిర్వహించిన అనంతరం గర్భగుడిలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. తరువాత శ్రీ లక్ష్మీ తాయారు అమ్మవారిని, ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చక స్వాములు కలెక్టర్‌కు స్వామివారి పట్టు వస్త్రాలు అందజేసి ఆలయ విశిష్టతను వివరించి తీర్థప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం తహసీల్దార్ ధనియాల వెంకటేశ్వర్లు, అర్చక స్వాములు మరియు దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు

## ఘనంగా ప్రారంభమైన హెచ్ పి వి వ్యాక్సినేషన్





**కొత్తగూడెం కలెక్టరేట్: మార్చే8 :ప్రజా జ్యోతి** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం హెచ్.పి.వి. వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ తుకారాం రాథోడ్, జిల్లా ఆసుపత్రుల సేవల సమన్వయకర్త (డి.సి.హెచ్.ఎస్) డాక్టర్ రవిబాబుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి మాట్లాడుతూ, గర్భాశయ క్యాన్సర్ నివారణకు జిల్లా వ్యాప్తంగా 10,393 మంది బాలికలను గుర్తించామని, ఈ ప్రత్యేక డ్రైవ్ మూడు నెలల పాటు కొనసాగుతుందని తెలిపారు. మొదటి నెలలో టీవీవీపీ , డీఎంఈ పరిధిలోని ఆసుపత్రుల్లో, తదుపరి రెండు నెలల పాటు 24 గంటలు పనిచేసే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 'గార్డాసిల్-4' సింగిల్ డోస్ టీకాను ఉచితంగా అందజేస్తామని వివరించారు. ఏప్రిల్ 1, 2011 తర్వాత జన్మించి, 14 ఏళ్లు నిండిన 15 ఏళ్లలోపు బాలికలు ఈ టీకాకు అర్హులని, ఆధార్ కార్డుతో పాటు తల్లిదండ్రుల అనుమతి పత్రం తప్పనిసరని ఆయన పేర్కొన్నారు. తీవ్ర అనారోగ్యం ఉన్న వారికి మినహాయింపు ఉంటుందని స్పష్టం చేశారు. అనంతరం ఈ కార్యక్రమాన్ని జాతీయ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో (యూ.ఐ.పి) విలీనం చేస్తామని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని డాక్టర్ తుకారాం రాథోడ్ కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రసాద్ డిప్యూటీ డి ఎం హెచ్ ఓ, డాక్టర్ ప్రతాప్ డి ఐ ఓ, డాక్టర్ హరీష్ ఎం ఓ, బి. సీతమ్మ సి హెచ్ ఓ, ఏ ఎన్ ఎం లు ఎస్ కృపామణి, ఎం రమాదేవి, ఎస్కే సల్మా పాల్గొన్నారు.

## హెచ్పివి వ్యాక్సిన్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే







**ఇల్లందు, మార్చి 8, ప్రజాజ్యోతి:** గర్భాశయ క్యాన్సర్ నివారణకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న వ్యాక్సిన్ ను ఆదివారం విల్లన్ ప్రభుత్వ వైద్యశాలలో ఎమ్మెల్యే కోరం కనకయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గర్భాశయ క్యాన్సర్ రాకుండా కేంద్ర ప్రభుత్వం హెచ్పివి వ్యాక్సిన్ ను ఆడబిడ్డలు అందరు వేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు మున్సిపాలిటి చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్, ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ హర్షవర్ధన్, హాస్పిటల్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పద్మశాలి సంఘ భవనం ప్రారంభం



**ఇల్లందు, మార్చి 8, ప్రజాజ్యోతి:** ఇల్లందు మున్సిపాలిటిలో పద్మశాలి సంఘ భవనాన్ని ఆదివారం ఎమ్మెల్యే కోరం కనకయ్య ప్రారంభించారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇల్లందులో పద్మశాలి సంఘం భవనం ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. మన జాతి మనుగడ, మన హక్కుల సాధనకు మనందరం కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్, మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, మాజీ మున్సిపల్ చైర్మన్ దమ్మలపాటి వెంకటేశ్వరరావు, రాష్ట్ర బీసీ సంఘాల జేఏసీ కన్వీనర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మడత వెంకట్ గౌడ్, ప్రజా ప్రతినిధులు, పద్మశాలి సంఘ కులస్తులు, ప్రజలు పాల్గొన్నారు.

## సమాజ అభివృద్ధికి మహిళల పాత్ర కీలకం



**ఇల్లందు, మార్చి 8, ప్రజాజ్యోతి:** సమాజ అభివృద్ధికి మహిళల పాత్ర కీలకమని ఇల్లందు మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం ఇల్లందు నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యాలయంలో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో ముఖ్యమంత్రి కేసీఆర్ మహిళల సంక్షేమం కోసం కళ్యాణలక్ష్మి, షాది ముబారక్, కేసీఆర్ కిట్ వంటి పథకాలు అమలు చేశారని గుర్తు చేశారు. స్థానిక సంస్థల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించడం కూడా బీఆర్ఎస్ ప్రభుత్వమేనని పేర్కొన్నారు. మహిళలు అన్ని రంగాలతో పాటు రాజకీయాల్లో కూడా కీలకంగా మారాలనే ఉద్దేశంతో కెసిఆర్ మహిళలను ఎంతో ప్రోత్సహించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా ప్రజాప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వంట గ్యాస్ ధరలు తగ్గించాలని అంబేద్కర్ సెంటర్‌లో సిపిఎం నిరసన

- **సిపిఎం మండల కార్యదర్శి సత్రపల్లి సాంబశివరావు**




**మణుగూరు, మార్చి 08 (ప్రజాజ్యోతి):** వంట గ్యాస్ ధరలను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) సిపిఎం మణుగూరు మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో ఆదివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఖండిస్తూ ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి సత్రపల్లి సాంబశివరావు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రోజురోజుకు ప్రజలపై ఆర్థిక భారాన్ని పెంచుతోందని విమర్శించారు. ఇటీవల వంట గ్యాస్ సిలిండర్‌పై రూ.60 పెంపు చేయడం పేద మరియు మధ్యతరగతి కుటుంబాలపై తీవ్రమైన ప్రభావం చూపుతుందని అన్నారు. అలాగే కమర్షియల్ సిలిండర్ ధరను రూ.115 పెంచడం ద్వారా సామాన్య ప్రజలపై మరింత భారం మోపుతున్నారని పేర్కొన్నారు. అదే సమయంలో పెద్ద కంపెనీలకు రాయితీలు, రుణాలు అందిస్తూ సంపన్న వర్గాలను ప్రోత్సహిస్తున్నారని, కానీ పేదల జీవన వ్యయం మాత్రం పెరుగుతున్నదని విమర్శించారు. పెంచిన గ్యాస్ ధరలతో పాటు నిత్యావసర వస్తువుల ధరలను కూడా వెంటనే తగ్గించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల సీనియర్ నాయకులు కొడిశాల రాములు, మండల కార్యదర్శి వర్గ సభ్యులు పిట్టల నాగమణి, డి. వెంకన్న, ఎస్. వెంకటరావు, మండల కమిటీ సభ్యులు తోట పద్మ, సారిక, ఎస్ఎఫ్ఐ డివిజన్ నాయకులు మాదాసి అఖిల్, తేజ, ఆఫీస్ కార్యదర్శి నరసయ్య, అలాగే రాజమ్మ, ఐలమ్మ పాల్గొన్నారు.

## తడి చెత్త పొడిచెత్తపై అవగాహన సదస్సు



**ఇల్లందు, మార్చి 8, ప్రజాజ్యోతి:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలలో భాగంగా ఆదివారం 22వ వార్డులో మున్సిపల్ కమిషనర్ గణేష్ తడి చెత్త పొడి చెత్త పై అవగాహన కల్పించారు. ప్రతిరోజు ఉదయం తడి పొడి చెత్తలను వేరు చేసి మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలని సూచించారు. బయట ప్రదేశాలలో చెత్తను వేయవద్దని కోరారు. 22వ వార్డు కౌన్సిలర్ కొర్లపాటి శివ కిరణ్ గతంలో ఇచ్చిన తడి పొడి చెత్త డబ్బాలు పాడైనవని, 22వ వార్డుకు 1500 నూతన తడి పొడి చెత్త డబ్బాలను అందించాలని కమిషనర్ కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ రజిని, జవాన్ కళ్యాణ్, వర్క్ ఇన్స్పెక్టర్ కృష్ణ, ప్రవీణ్, ఆర్. పి. దొరపల్లి మమత, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# మతసామరస్యానికి, స్నేహభావానికి ప్రతీక రంజాన్

- **ఉపవాస దీక్షలు**
**కొత్వాల శ్రీనివాసరావు**





**పాల్వంచ, మార్చి 8, ప్రజాజ్యోతి:** రంజాన్ మాసంలో ముస్లింలు ఆచరించే ఉపవాస దీక్షలు మతసామరస్యానికి, స్నేహభావానికి ప్రతీకగా నిలుస్తాయని రాష్ట్ర మార్కెఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు పేర్కొన్నారు. పాత పాల్వంచలోని మక్కా మజీద్ వద్ద కొత్వాల శ్రీనివాసరావు తన సతీమణి, 46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవితో కలిసి ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కొత్వాల శ్రీనివాసరావు మాట్లాడుతూ, అన్ని మతాల సారాంశం ఒక్కటేనని, సమాజంలో ప్రతి ఒక్కరూ పరస్పర గౌరవంతో, సోదరభావంతో మెలగాలని అన్నారు. రంజాన్ పర్వదినం మానవత్వం, సేవాభావం, ఐక్యతను పెంపొందించే పండుగగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ నాయకులు సయ్యద్ యాకుబ్, ఎస్కే జలీల్, ఎస్కే ఖుర్షిద్, సయ్యద్ కరీముల్లా, ఎస్కే రెహమాన్, ఎస్కే నజీర్, వజీర్, ఖాజా మొయినుద్దీన్, ఈసుబ్, షాబీర్ అహ్మద్, కొట్టు కరీం, వనమా సత్యనారాయణ (చిన్న బాబు), చిన్నపండు, బూసి శ్రీను, తిరుమలరావు, బొందిలి బాలాజీ, యాటా నాని, బండారి తేజ, యాదా నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు ఘన సన్మానం



**చర్ల, మార్చ్ 07: (ప్రజా జ్యోతి ):** చర్ల మండలలో ఆదివారం బిఆర్ యస్ పార్టీ ఆఫీసులో కన్వీనర్ దొడ్డి తాతారావు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గ్రామ పంచాయతీ మహిళా సర్పంచ్ లకు మహిళ వార్డు మెంబర్లలకు పార్టీ మహిళ నాయకులకు పంచాయతీ గ్రామ మహిళ కార్మికులకు శాలువలు కప్పి ఘనంగా సన్మానించారు .ముందుగా మహిళలతో పంచాయతీ మహిళ కార్మికులకు శాలువలు కప్పి సన్మానించి వారికి చీరలు పెట్టి సత్కరించడం జరిగింది .అనంతరం ఒక్కొక్క మహిళలకు మహిళలతో సన్మానించారు మిఠాయిలు పంచుకొని ఒకరితో ఒకరు అభినందనలు తెలియజేసుకున్నారు. అనంతరం మహిళలందరు కలిసి సంతలో వ్యాపారం చేస్తున్న మహిళలందరికి స్వీట్స్ పంపిణీ చేసారు. ఈ సందర్భంగా కన్వీనర్ మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం మార్చి 8 న అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకుంటారు అని మహిళలు సాధించిన విజయాలకు పురుషులతో సమానంగా ఎదుగుటవలన అంతర్జాతీయ మహిళ దినోత్సవం జరుపుకుంటారు అని నేటి సమాజంలో అన్ని రంగాల్లో ఉద్యోగాల దగ్గర నుండి రాజకీయాలు వరకు స్త్రీలు అభివృద్ధి చెందారు అని స్త్రీలు సమాజంలో ఆర్థికంగా రాజకీయంగా రాణిస్తున్నారని అదేవిధంగా ప్రజలు ఎంతో నమ్మకంతో మిమ్మల్ని ఎన్నుకున్నారు కావున గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేసి మంచి పేరు తెచ్చుకోవాలని అన్నారు . ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మహిళ ఉపాధ్యక్షురాలు సౌజన్య మహిళ నాయకులు బేతం చర్ల నర్సవేణి సీనియర్ నాయకులు ఎస్ డి అజీజ్ తడికల బుల్లేబ్బాయి బిసి సెల్ అధ్యక్షుడు గోరింట్ల ట్వెంకటేశ్వరావు అలవాల కృష్ణ కనుకు వీరభద్రం పాసిగంటి సంతోష్ వంకాయల వినోద్ వంకాయల రాణి పలకపుష్ప పాసిగంటి సంధ్య సోయం నాగలక్ష్మి బెండబోయిన సుహాసిని ఉప్పట్ల నాగలక్ష్మి అనే మంది మహిళా సర్పంచులు వార్డ్ మెంబర్ లు మహిళలు పాల్గొన్నారు.

## ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు



**ఇల్లందు, మార్చి 8, ప్రజాజ్యోతి:** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం ఇల్లందు పోలీస్ స్టేషన్ లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇల్లందు డిఎస్పి యు వెంకన్న బాబు ఆధ్వర్యంలో సబ్ డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ లలో నిర్వహిస్తున్న మహిళా పోలీస్ సిబ్బందిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ మహిళలు పురుషులతో పాటు అన్ని రంగాలలో ముందుండాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలు తన పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇల్లందు, టేకులపల్లి, గుండాల సీఐలు తాటిపాముల సురేష్, బత్తుల సత్యనారాయణ, తిరుపతి, ఎస్ఐ లు, సిబ్బంది పాల్గొన్నారు.

## హెచ్ పి వి వ్యాక్సిన్ ప్రారంభ కార్యక్రమం





**చర్ల, మార్చ్ 08: (ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా చర్ల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో హెచ్ పి వి వ్యాక్సిన్ ఓపెనింగ్ కార్యక్రమాన్ని ఉపసర్పంచ్ కాపుల కృష్ణార్జున రావు ప్రారంభించారు . ఈ సందర్భంగా ఉపసర్పంచ్ కృష్ణార్జున రావు గారు మాట్లాడుతూ గవర్నమెంట్ హెచ్ పి వి వ్యాక్సిన్ ఉచితంగా అందుబాటులోకి తేవడం ఎంతో సంతోషించదగిన విషయం అని అనేక మంది స్త్రీలు గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ కి గురై మరణించడం జరుగుతుంది అని అయితే ఈ వ్యాక్సిన్ వలన ఇకపై ప్రతి స్త్రీ గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ నుండి విముక్తి పొందవచ్చు అని తెలియజేశారు. యం పి డి ఓహ్ ఈదయ్య మాట్లాడుతూ ఇప్పటికే ఈ వ్యాక్సిన్ ప్రైవేట్ హాస్పిటల్లో అందుబాటులో ఉన్నది అని అయితే ఈ వ్యాక్సిన్ చాలా ఖరీదు తో కూడుకున్న వ్యాక్సిన్ అని ప్రభుత్వం ఇంత ఖరీదైన వ్యాక్సిన్ ని ఉచితంగా అందించడం ఎంతో సంతోషకరమైన విషయం అని ఈ వ్యాక్సిన్ కొత్తది కాదు కనుక వ్యాక్సిన్ వేసుకోవడానికి ఎవరూ వెనకంజ వేయకండి ఎటువంటి అపోహలు పెట్టుకోకండి అర్హులైన అందరూ ఈ వ్యాక్స్ ని వేయించుకోవాలని తెలియజేశారు. ఎమ్మార్వో ఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రస్తుతం 14 సంవత్సరాల విద్యార్థిని లకు ఈ వ్యాక్సిన్ అందిస్తున్నారు అని దసలవారీగా ఈ వ్యాక్సిన్ని అందరూ స్త్రీలకు అందించే అవకాశం ఉన్నది అని 14 సంవత్సరాల నుండి 15 సంవత్సరాలు లోపు విద్యార్థినిలు తమ ఆధార్ కార్డు ఆశా కార్యకర్తలకు చూపించి వారి పేరుని నమోదు చేయించుకోవాల్సిందిగా కోరారు. ఈ వ్యాక్సిన్ వల్ల ఎంతో ఉపయోగం ఉంటుంది అని ఏ ఒక్కరు కూడా ఈ వ్యాక్సిన్ వేసుకోకుండా ఉండవద్దని తెలియజేశారు. ఎంఈఓ రమణ మాట్లాడుతూ హెచ్ పి వి వ్యాక్సిన్ ప్రభుత్వం ఉచితంగా ప్రవేశపెట్టడం అద్భుతమైన విషయమని. ప్రతి ఒక్కరు ఈ వ్యాక్సిన్ వేయించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపర్డెంట్ డాక్టర్ సాయి వర్ధన్ గారు, మెడికల్ ఆఫీసర్ రామ్ ప్రసాద్ గారు హెచ్ పీ వి వ్యాక్సిన్ ఉపయోగాలు తగు జాగ్రత్తలు తెలియజేశారు. డాక్టర్ హారిక మెడికల్ ఆఫీసర్ చర్ల మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని మహిళా దినోత్సవం సందర్భంగా ప్రారంభించడం గొప్ప శుభ సూచికమని. ఈ కార్యక్రమం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో నెలరోజులు కొనసాగుతుందని. తరువాత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అనంతరం రొటీన్ ఇమ్యూనైజేషన్ సెషన్ లో ఈ వ్యాక్సిన్ అందుబాటులో ఉంటుంది అని అందరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగపర్చుకోవాలని తెలియజేశారు. ఈ. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కర్యకర్తలు పాల్గొన్నారు.

# పాల్వంచ పోలీస్ స్టేషన్ లో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

- మహిళల సేవలు అభినందనీయం
- డీఎస్పీ సతీష్ కుమార్





**కొత్తగూడెం కలెక్టరేట్, మార్చి8 ప్రజా జ్యోతి :** అంతర్జాతీయ మహి ళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పాల్వంచ పట్టణ పోలీస్ స్టేషన్ లో డీఎస్పీ కుమార్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు, ఈ సందర్భంగా మహిళా పోలీ స్ అధికారులను , సిబ్బందిని డి.ఎస్. పి శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో డిఎస్పి మాట్లాడుతూ మహిళల్లో సంకల్పశక్తి ఎక్కువగా ఉంటుందని, వారు ఏ రంగంలోనైనా గొప్ప విజయాలు సాధించగలరని అన్నారు. దేశంలోని అన్ని రంగాల్లో మహిళలు ఉన్నత స్థానాలకు చేరుకుంటూ పురుషులతో సమానంగా రాణిస్తున్నారని పేర్కొన్నారు. మహిళలకు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో హక్కులు ఉన్నాయని అన్నారు మహి ళా అధికారులు తమ పూర్తి శక్తి, సామర్థ్యాలతో విధులు నిర్వహిస్తూ తమ లక్ష్యాలను సాధించేందుకు నిరంతరం కృషి చేయాలని సూచించారు. పురుషుల కంటే మహిళల్లో నిబద్ధత ఎక్కువగా ఉంటుందని, పలు విభాగాల్లో మహిళా పోలీస్ అధికారులు, సిబ్బంది సమర్థవంతంగా సేవలందిస్తున్నారని తెలిపారు.పోలీస్ స్టేషన్లలో రిసెప్షన్ విధులు, కోర్టు డ్యూటీ ఆఫీసర్, రైటర్, పెట్రోలింగ్, బ్లూ కోట్స్, సైబర్ వారియర్స్, పాఠశాలలు , కళాశాలల్లో షీ టీమ్స్ ద్వారా సైబర్ క్రైమ్‌లపై అవగాహన కార్యక్రమాలు, ముఖ్యమైన బందోబస్త్ బాధ్యతలను మహిళా పోలీస్ అధికారులు,సిబ్బంది సమర్థంగా నిర్వహిస్తున్నారని అన్నారు. గృహహింస, వైవాహిక వివాదాల వంటి కేసుల్లో బాధిత మహిళలకు కౌన్సెలింగ్ అందిస్తూ మహిళా పోలీస్ అధికారులు, సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు, మహిళలు పలు రంగాల్లో సాధిస్తున్న విజయాలు రాబోయే తరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని , మహిళా అధికారులు ధైర్యంగా ఉండి తమ వృత్తిపరమైన బాధ్యతలను గౌరవంగా నిర్వహించాలని సూచించారు. మహిళా పోలీస్ సిబ్బంది సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, వారికి అన్ని విధాలుగా అండగా ఉంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాల్వం చ టౌన్ ఎస్సై తోట నాగరాజు , బూర్గంపాడు ఎస్సై ప్రసాద్ , పాల్వంచ రూరల్ ఎస్సై సురేష్ , పాల్వంచ టౌన్ ఎస్సై కళ్యాణి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి ఎల్ఓసీ అందజేత



**బూర్గంపహాడ్, మార్చి8 (ప్రజా జ్యోతి):** బూర్గంపహాడ్ మండల కేంద్రానికి చెందిన బయ్యా జ్యోతి అనారోగ్యంతో బాధపడుతూ మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ లోని నిమ్స్ ఆసుపత్రి నందు చికిత్స పొందుతున్నారు. కాగా చికిత్స కోసం అతడి కుటుంబీకులు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కలువగా సీఎంఆర్ఎఫ్ కింద ఎల్వోసీ మంజూరు చేయించారు. ఈమేరకు ఆదివారం రూ.5లక్షల ఎల్వోసీని మణుగూరులోని ఆయన నివాసంలో బాధిత కుటుంబీకులకు ఎమ్మెల్యే అందజేశారు. నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నారు.ఈ కార్యక్రమంలో బూర్గంపాడు ఉపసర్పంచ్ గుండె వెంకన్న, భజన ప్రసాద్ కుమార్,యడమకంటి సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పేద కుటుంబానికి సాయం



**ఇల్లందు టౌన్, మార్చి 8, ప్రజా జ్యోతి:** ఇల్లందు మున్సిపల్ పరిధిలోని 7వ వార్డుకు చెందిన యండి జమీర్ డయాలసిస్ పేషెంట్ కావడంతో ఆదివారం వార్డు కౌన్సిలర్ గోపగాని రాజు ఆధ్వర్యంలో వార్డుకు చెందిన అవుల శ్రీనివాస్ 25 కేజీల బియ్యంతో పాటు వార్డు కౌన్సిలర్ గోపగాని రాజు గౌడ్ రూ. 1000 సాయం చేశారు. అదేవిధంగా ఇల్లునుల పాడుకు చెం దిన కొంగర ఓం ప్రకాష్ రూ. 500 లను అందజేశారు. ఆర్థిక స్తోమత లేనందున వారి కుటుంబాన్ని ఆదుకోవాలని, దాతలు 6304627703 నెంబర్ కు ఫోన్ పే, గూగుల్ పే ద్వారా ఆర్థిక సాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యండి మున్నీ, ఆవుల లక్ష్మి, కంటే రాజు, ఆవుల రవి తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలి

- టి ఎస్ యు టి ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చావా దుర్గా భవాని




**పాల్వంచ, మార్చి 8, ప్రజాజ్యోతి:** మహిళలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కరించడంతో పాటు వారు పనిచేసే ప్రాంతాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని, మహిళలపై సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీమతి చావా దుర్గా భవాని పేర్కొన్నారు.అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం పాల్వంచ మండలంలోని శ్రీ సాయి తేజ ఫంక్షన్ హాల్ లో తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ పాల్వంచ మండల శాఖ ఆధ్వర్యంలో మహిళా చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల ఉపాధ్యక్షులు పి. సత్యశ్రీ అధ్యక్షత వహించారు.ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ఉపాధ్యక్షులు చావా దుర్గా భవాని మాట్లాడుతూ, నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాలలో ముందుకు సాగుతున్నప్పటికీ ఇంకా అనేక రకాల సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా సోషల్ మీడియా ద్వారా మహిళలపై అసభ్యకర వ్యాఖ్యలు, పోస్టులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే మహిళలు పనిచేసే ప్రాంతాల్లో సరైన సౌకర్యాలు లేకపోవడం వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. మహిళల అక్రమ రవాణా వంటి ఘటనలు ఇంకా జరుగుతున్న నేపథ్యంలో వాటిని అరికట్టేందుకు కఠిన చట్టాలు అమలు చేయాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు. మహిళలలో చైతన్యం పెంపొందించే విధంగా ప్రభుత్వాలు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. పద్మలత పాల్గొని మాట్లాడుతూ, సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో గొప్పదని, మహిళల్లో చైతన్యం పెరగడం సమాజానికి ఎంతో అవసరమని అన్నారు.ఈ సందర్భంగా మహిళల కోసం ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు హాజరైన అతిథుల చేత బహుమతులు అందజేశారు.ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి బి. రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షులు మురళీమోహన్, పాల్వంచ మండల అధ్యక్షుడు ఎం. శ్రీనివాసరావు, మండల కార్యదర్శి జి. హరి, మహిళా కార్యదర్శి యశోద, మహిళా కన్వీనర్ కే. సువర్చల తదితరులు పాల్గొన్నారు. అలాగే శ్యామల, ఆస్మా, హబీబున్నిసా, లక్ష్మి, బైరి మాధవి, వి. కవిత, మౌలాబీ పద్మజ, ఎం. రాజులు, అంబ్రికా జాదవ్, ఉమారాణి, సుధారాణి, లీలా మాధురి తదితరులు హాజరయ్యారు.

# జయహో ...జనయిత్రి

- ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు







**చర్ల, మార్చ్ 08: (ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో ఆదివారం ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ (ఏ టి ఏ ) ఆధ్వర్యంలో ఆదివాసీ మహిళా దినోత్సవాన్ని ఆటపాటల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దేశ ధనలక్ష్మి బెండబోయిన సరోజిని అధ్యక్షత వహించగా ఇటీవల ఎన్నికైన మహిళా సర్పంచ్ సోయం నాగలక్ష్మి (ఉప్పరిగూడెం), కాపుల శారద (కేశవాపురం) లను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహిళా ఉపాధ్యాయులు, మహిళలు సాంస్కృతిక కార్యక్రమం లో ఆటపాటలతో ఉత్సాహంగా పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.ఏ టి ఏ మండల అధ్యక్షుడు శ్యామల రామారావు,ఏ టి ఏ రాష్ట్ర నాయకులు బి .సత్యనారాయణ పాల్గొని మహిళలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భగా ఏ టి ఏ మండల జనరల్ సెక్రటరీ తోకల లక్ష్మీపతి మాట్లాడుతూ మహిళల ప్రతిభ, ఓర్పు, నేర్పు, త్యాగం, ప్రేమ వంటి విలువల వల్లే కుటుంబం సంతోషంగా నిలుస్తుందని సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర అత్యంత కీలకమని, వారికి తగిన గౌరవం, మద్దతు, స్వేచ్ఛ కల్పించినప్పుడే నిజమైన మహిళా సాధికారత సాధ్యమవుతుందని అలాగే మహిళల హక్కులు, చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరాన్ని వివరించారు.దేశ తులసిరాం మాట్లాడుతూ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసి మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పి. జీవనజ్యోతి, బి. శారద, కె. హైమావతి, కె. సుగుణ,కె. నిర్మల, పి. అరుణ, పి. బుచ్చిరాజు,ఎస్ .శేషు,కె.రాజబాబు, ఎం. రాజకుమార్ ఏం . సరిత తదితరులు పాల్గొన్నారు. మహిళలు, పిల్లలు, పెద్దలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మహిళలు అన్ని రంగాలలో రాణించాలి

- పినపాక ఎంపీడీవో వెంకటేశ్వరరావు





**పినపాక,మార్చి 08(ప్రజాజ్యోతి ):** మహిళలు అన్ని రంగాలలో రాణించాలని పినపాక ఎంపీడీవో వెంకటేశ్వరరావు అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం భూపాలపట్నం గ్రామపంచాయతీలో సర్పంచ్ తొలేం స్వప్న ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో రాణించాలని ఆయన కోరారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో మహిళల సేవలు అమోఘమని తెలియజేశారు. మహిళలు వారి హక్కులను వినియోగించుకోవాలని తెలిపారు. ప్రభుత్వాలు 33% మహిళలకు రిజర్వేషన్ కల్పించడం హర్షనీయమన్నారు. ఈ యొక్క కార్యక్రమంలో ఉప సర్పంచ్ నిట్ట శిరీష, వెంకట్రావుపేట సర్పంచ్ సింధు, వార్డు మెంబర్లు సంధ్యారాణి, బొగ్గం రమణ, నిట్ట సావిత్రి, తులసమ్మ, మహేంద్ర, నరసింహారావు, అంగన్వాడీ టీచర్ సుజాత, ఆశా వర్కర్ నీలమ్మ మొదలైన వారు పాల్గొన్నారు.

## నూతన ఇందిరమ్మ ఇల్లును ప్రారంభించిన సర్పంచ్ మచ్చా నరసింహారావు



**అశ్వాపురం, మార్చి 8 ప్రజా జ్యోతి దినపత్రిక** అశ్వాపురం మండల పరిధిలోని మల్లెలమడుగుగ్రామం లో నూతన ఇందిరమ్మ ఇల్లు ను ఆదివారం మల్లెల మడుగు గ్రామ పంచాయతీ సర్పంచ్ మచ్చా నరసింహారావు ప్రారంభించి లబ్ధిదారు కుటుంబ సభ్యుల తో గృహ ప్రవేశం చేయించారు. మా సొంతింటి కల నెరవేర్చినందుకు లబ్ధిదారు కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ప్రభుత్వానికి, సర్పంచ్ కు కాంగ్రెస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సర్గం బాల నరసయ్య , కాంగ్రెస్ పార్టీ నాయకులు బేతం రామకృష్ణ తూము పెద్ద రాఘవులు, బచ్చు వెంకటరమణ, ఆవుల రవి, పిట్ట ప్రశాంత్, బారాజు సంపత్, చెంచల రాము , మానాది వెంకన్న, గొడ్ల నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా పరిశుభ్రత కార్యక్రమాలు

- **పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత : ఎంపీడీవో మహాలక్ష్మి**





**అన్నపురెడ్డిపల్లి, మార్చి 8, ప్రజా జ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండలంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మూడవ రోజు గ్రామపంచాయతీలలో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి ప్రతిరోజూ గ్రామపంచాయతీ ట్రాక్టర్లలో వేయాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి మహాలక్ష్మి మాట్లాడుతూ గ్రామాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. తడి చెత్తతో సేంద్రీయ ఎరువులు తయారు చేయవచ్చని, పొడి చెత్తను రీసైక్లింగ్ ద్వారా మళ్లీ ఉపయోగించవచ్చని వివరించారు. గ్రామాల్లో చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా పరిశుభ్రత పాటించాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా గ్రామాల్లో పైప్‌లైన్ లీకేజీలను గుర్తించి మరమ్మతులు చేయడం, సైడ్ డ్రెయిన్‌లను శుభ్రం చేయడం వంటి పనులను కూడా చేపట్టారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో పరిశుభ్ర వాతావరణం నెలకొల్పేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి షబ్నా, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. ప్రజాపాలన కార్యాచరణ ప్రణాళికలో భాగంగా గ్రామాల్లో అభివృద్ధి పనులు మరింత వేగంగా చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

# టీఎస్ యుటీఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు





**భద్రాచలం, మార్చి 8,ప్రజాజ్యోతి :** టీఎస్ యుటీఎఫ్ భద్రాచలం మహిళా డివిజన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా మహిళా కార్యదర్శి టి. చిన్నక్క అధ్యక్షతన భద్రాచలంలోని ప్రాంతీయ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళా ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా ఉపాధ్యాయుల కోసం ఆటల పోటీలు నిర్వహించారు. రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఆర్.ఎస్. బాలాజీ రాజు మహిళలపై రచించిన కవితలను వినిపించి సభను ఆకట్టుకున్నారు. అనంతరం మహిళా సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాధికారి తోటమల్ల రమ మాట్లాడుతూ ప్రాచీన కాలం నుంచి ఆధునిక కాలం వరకు మహిళలు వివిధ రంగాల్లో సాధించిన అభివృద్ధిని వివరించారు. సమాజం అభివృద్ధి చెందాలంటే మహిళలకు పురుషులతో సమాన అవకాశాలు, స్వేచ్ఛ, గౌరవం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. స్త్రీ సాధికారతతోనే సమాజ శ్రేయస్సు సాధ్యమవుతుందని, మహిళలను రెండో తరగతి పౌరులుగా చూసే దృక్పథంలో మార్పు రావాలని అన్నారు. స్త్రీ–పురుషులు సమానమనే భావనను చిన్ననాటి నుంచే పిల్లల్లో పెంపొందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని పేర్కొన్నారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న పట్టణ ప్రముఖ వైద్యురాలు డాక్టర్ తేజస్విని (ఎండీ) మాట్లాడుతూ మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యం అవసరమని తెలిపారు. మహిళల చేతిలో పరిపాలన ఉంటే విద్య, ఆరోగ్యం, పారిశుద్ధ్యం వంటి సామాజిక అంశాలకు మరింత ప్రాధాన్యత లభిస్తుందని అన్నారు. 14 సంవత్సరాలు నిండిన బాలికలు తప్పనిసరిగా హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు. టీఎస్ యుటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి. మురళీమోహన్ మాట్లాడుతూ మహిళల అక్షరాస్యత శాతం పెరిగినప్పటికీ ఇంకా కొంతమంది మహిళలు వెనుకబడి ఉన్నారని అన్నారు. 100 శాతం అక్షరాస్యత సాధించే దిశగా మహిళలు ముందుకు రావాలని కోరారు. పార్లమెంట్, అసెంబ్లీల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని అభిప్రాయపడ్డారు.టీఎస్ యుటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి. రాజు మాట్లాడుతూ సంఘంలో ప్రధాన బాధ్యతల్లో మహిళలకు 25 శాతం ప్రాతినిధ్యం కల్పించామని తెలిపారు. యుటీఎఫ్ మహిళలు ఉన్న పాఠశాలలు ఇతర పాఠశాలలతో పోల్చితే అభివృద్ధిలో ముందుంటున్నాయని పేర్కొన్నారు. ప్రతి యుటీఎఫ్ కార్యకర్త తమ పాఠశాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని, ప్రభుత్వ విద్యా రంగాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా దుమ్ముగూడెం హైస్కూల్‌లో పనిచేస్తున్న కోటేశ్వరి, భద్రాచలం ప్రభుత్వ హైస్కూల్ లో పనిచేస్తున్న పద్మజలను సన్మానించారు. ఆటల పోటీల్లో పాల్గొన్న మహిళా ఉపాధ్యాయులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎస్. శైలజ, మహాత్మా జ్యోతిరావు పూలే గురుకులం వింగ్ జిల్లా అధ్యక్షురాలు టి. సునీత, జిల్లా కార్యదర్శి ఎస్. విజయ్ కుమార్, దుమ్ముగూడెం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కోటేశ్వరి, భద్రాచలం ప్రభుత్వ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు పద్మజ, దుమ్ముగూడెం అధ్యక్షుడు ఏ. వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి ఎం. సురేష్ బాబు, భద్రాచలం అధ్యక్షుడు కొమరం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పి.ఎస్.వి. ప్రసాద్ బాబు, దుమ్ముగూడెం మహిళా కార్యదర్శి జి. సునీత, ఉపాధ్యక్షురాలు బి. మంగవేణి, భద్రాచలం ఉపాధ్యక్షురాలు కే. పుష్పలత, కేఎం కరుణ్ కుమార్, టీజీటిడబ్ల్యూ ఆర్జేసీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్యామల హేమలత, భద్రాచలం కార్యదర్శి కె. నాగలక్ష్మి, యుటీఎఫ్ సీనియర్ నాయకుడు రాజ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# బాలికల ఆరోగ్య రక్షణకు హెచ్‌పీవీ టీకా కార్యక్రమం ప్రారంభం





**పాల్వంచ, మార్చి 8, ప్రజాజ్యోతి:** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బాలికలను గర్భాశయ కంఠ క్యాన్సర్ నుంచి రక్షించేందుకు ప్రభుత్వం చేపట్టిన హెచ్‌పీవీ (హ్యూమన్ పాపిలోమా వైరస్) టీకా కార్యక్రమును ఆదివారం జిల్లాలో ఘనంగా ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా పలు ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలలో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. మొదటగా ★కొత్తగూడెం జి జి హెచ్ (ప్రభుత్వ జనరల్ హాస్పిటల్)★లో నిర్వహించిన కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ శ్రీ అంకిత్, ఐఏఎస్, ఎమ్మెల్యే శ్రీ కూనంనేని సాంబశివ రావు, కొత్తగూడెం మేయర్ శ్రీ గణేష్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. రాధామోహన్ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలికల ఆరోగ్య రక్షణలో హెచ్‌పీవీ టీకా కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. అర్హత కలిగిన బాలికలు ఈ టీకాను తీసుకోవడం ద్వారా భవిష్యత్తులో గర్భాశయ కంఠ క్యాన్సర్ నుంచి రక్షణ పొందవచ్చని పేర్కొన్నారు. అనంతరం ★పాల్వంచ సీ హెచ్ సీ (కమ్యూనిటీ హెల్త్ సెంటర్)★లో ఈ కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. తుకారాం రాథోడ్ (డి ఎం హెచ్ ఓ) మరియు జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డా. రవిబాబు (డి సీ హెచ్ ఎస్) కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలికల ఆరోగ్య సంరక్షణలో హెచ్‌పీవీ టీకా ఎంతో ముఖ్యమని, ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలలో ఈ టీకాను ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డా. ప్రసాద్, పి ఓ–సీ హెచ్ ఐ డా. ప్రతాప్, పి ఓ–ఎన్ వి బి డి సి పి డా. స్పందన, సీ హెచ్ సీ పాల్వంచ సూపరింటెండెంట్ డా. రాంప్రసాద్ పాల్గొన్నారు. కార్యక్రమం సందర్భంగా ఒక బాలికకు ప్రతీకాత్మకంగా హెచ్‌పీవీ టీకా అందించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం జి జి హెచ్ మరియు పాల్వంచ సీ హెచ్ సీ వైద్య సిబ్బంది, సంబంధిత పీ హెచ్ సీలకు చెందిన మెడికల్ ఆఫీసర్లు, నర్సింగ్ సిబ్బంది, ఏ ఎన్ ఎమ్‌లు, ఆశా కార్యకర్తలు మరియు ఇతర ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు కూడా చేపడుతున్నారు. అధికారులు తెలిపిన ప్రకారం మొదటి నెలపాటు ఈ టీకా కార్యక్రమం జిల్లాలోని జి జి హెచ్, ఏ హెచ్ (ఏరియా హాస్పిటల్స్) మరియు సీ హెచ్ సీ లలో నిర్వహించనున్నారు. అనంతరం తదుపరి రెండు నెలల పాటు జిల్లాలోని 24 గంటల సేవలు అందించే పీ హెచ్ సీ లలో ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తారు. అర్హత కలిగిన బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆరోగ్య శాఖ అధికారులు కోరారు.

## పాదయాత్రగా భద్రాచలం చేరుకున్న భక్తులు

- మూడు రోజుల పాటు నడిచిన షిర్డీసాయి సేవసమితి సభ్యులు
- ప్రత్యేక దర్శనం ఆలయ కల్పించిన అధికారులు





**భద్రాచలం కల్చరల్, మార్చి08, ప్రజాజ్యోతి :** అశ్వారావుపేట పట్టణంలోని షిర్డీసాయి బాబా మందిరం నుండి శ్రీ షిర్డీసాయి సేవసమితి సభ్యులు 45 మంది మూడురోజుల పాటు పాదయాత్రగా భద్రాచలం చేరుకోని శ్రీ సీతారామచంద్రస్వామిని దర్శించుకున్నారు. వారికి ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక దర్శనానికి అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా శ్రీ షిర్డీసాయి సేవసమితి అధ్యక్షులు పంబి హరిబాబు మాట్లాడుతు గత 11సంవత్సరాల నుండి సంవత్సరం శ్రీ షిర్డీసాయిబాబా అనుగ్రహం, ఆశీస్సులతో పాదయాత్రగా భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి చెంతకు వస్తున్నామని, బాబావారి తరపున గోదావరి మాతకు ప్రత్యేక హారతులతో పాటు చీర, సారే అందించటం ఆనవాయితీగా వస్తుందన్నారు. భవిష్యత్తులోనూ అదే కోనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ పాదయాత్ర సహకరించిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదలు తెలుపుతున్నమన్నారు. ఈ కార్యక్రమంలో తిరుమలశెట్టి అప్పారావు, పృద్వీ, కన్నెబోయిన రమాదేవి, స్వప్న,నీలిమ,జ్యోతి, లక్ష్మి, పుప్పాల శివశంకర్, పావని, జగదాంబ ,శాంతి కుమారి, నాగు, సతీష్, దుర్గాప్రసాద్,తదితరులు పాల్గొన్నారు

## సమాజ మార్పులో మహిళలే కీలకం





**ఇల్లందు, మార్చి 8, ప్రజాజ్యోతి:** సమాజం మార్పు చెందాలంటే దానికి మహిళలే కీలకమని రొంపేడు వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ కవిత అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం ఇందిరానగర్ గ్రామపంచాయతీలో వివిధ రంగాల్లో అత్యున్నత స్థానంలో ఉన్న మహిళలను శాలువలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ కవిత మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో అగ్రభాగాన్ని నిలిచేందుకు నిరంతరం కృషి చేయాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు, చదువులో మహిళలు కీలకంగా మారుతున్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఓ డాక్టర్ అరుణకుమారి, ఇందిరానగర్ పంచాయతీ సర్పంచ్ భయం లలిత, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

## సిపిఎం ఆధ్వర్యంలో గ్యాస్ ధరలపై నిరసన



**భద్రాచలం , మార్చి 8 ,ప్రజాజ్యోతి :** పశ్చిమ ఆసియా లో జరుగుతున్న యుద్ధాన్ని బూచిగా చూపి యుద్ధం మాటున మోడీ దోపిడీని ప్రారంభించారని వెంటనే పెంచిన గ్యాస్ ధరలను తగ్గించకపోతే సిపిఐఎం ఆధ్వర్యంలో దేశవ్యాప్త ఉద్యమాన్ని చేపడతామని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బండారు శరత్ బాబు హెచ్చరించారు. ఆదివారం సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ సెంటర్లో గ్యాస్ సిలిండర్లను రోడ్డుపై ఉంచి నిరసనను తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ కార్యదర్శి వర్గ సభ్యురాలు డి సీత లక్ష్మి అధ్యక్షతన జరిగిన సభలో శరత్ బాబు మాట్లాడుతూ యుద్ధ ప్రభావం మన దేశంపై అప్పుడే చెబుతుంటే మోడీ మాత్రం ఇదే అదునుగా వాయించి గ్యాస్ పెట్రోల్ ధరలు పెంచేస్తున్నారని ఆరోపించారు. జాతీయ మార్కెట్లలో ముడిచమురు ధరలు తగ్గినప్పుడు ధరలు తగ్గించని మోదీ యుద్ధం సాకుగా చూపించి పేద ప్రజలపై భారలు మోపడం సరైనది కాదని అన్నారు. దేశం మొత్తం మహిళా దినోత్సవ వేడుకలు జరుపుకుంటూ ఉంటే మహిళలకు మోడీ ఇచ్చిన బహుమతి గ్యాస్ ధరలు పెంచడమేనా అని ప్రశ్నించారు. దేశం పాలిస్తున్నది నరేంద్ర మోడీ లేక డోనాల్డ్ ట్రంప్ కూడా తెలియని పరిస్థితి నెలకొంటుందని రష్యా వద్ద తక్కువ ధరకే ఆయిలు అందుతున్నప్పుడు మోడీ ట్రంపు కి భయపడి కొనుగోలు చేయలేదని అప్పుడే రష్యాతో ఆయిల్ కొనుగోలు కొనసాగించి ఉంటే ఇప్పుడు ఈ పరిస్థితి వచ్చేది కాదని శరత్ బాబు అన్నారు. వెంటనే పెంచిన గ్యాస్ ధరలను తగ్గించకపోతే మోడీ సర్కార్ నీ గద్దె దించక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు నాదెండ్ల లీలావతి చౌక్కా మాధవ రావు నకిరేకంటి నాగరాజు జీవనజ్యోతి ఎస్ అజయ్ కుమార్ కనక శ్రీ కొరడా శ్రీనివాస్ సీనియర్ నాయకులు ఎం వి ఎస్ నారాయణ డి రామకృష్ణ పాల్గొన్నారు

## గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌ను ఢీకొట్టిన టిప్పర్

- ట్రాక్టర్ డ్రైవరుకు తీవ్ర గాయాలు





**భద్రాచలం, మార్చి 8,ప్రజాజ్యోతి :** భద్రాచలంలో ఆదివారం ఆర్టీసీ బస్టాండు సమీపంలో భద్రాచలంలోని ఆర్టీసీ బస్టాండ్ దగ్గరలో పంచాయతీ ట్రాక్టర్ మొక్కలకు నీళ్లు పడుతుండగా ఒక ట్రిప్పర్ వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో పంచాయతీ ట్రాక్టర్ లో ఉన్న డ్రైవర్ ఎగిరి కింద పడ్డాడు. పంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్ కు కాలుకి చెయ్యికి గాయాలు అయ్యాయి. దగ్గర్లో కార్మికులు లేకపోవడంతో ప్రాణాలతో బయటపడ్డారు. టిప్పర్ ను ఆపి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో టిప్పర్ను పోలీస్ స్టేషన్కు తరలించారు. డ్రైవరుకు వైద్య చికిత్స అందిస్తున్నారు.

## మర్రిగూడెంలో తడి–పొడి చెత్త వేరు చేసే విధానంపై అవగాహన

- గ్రామ పరిశుభ్రత కోసం ప్రతి ఇంటి నుంచి చెత్తను వేరు చేసి ఇవ్వాలని సూచనలు





**అన్నపురెడ్డిపల్లి, మార్చి 8, ప్రజాజ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలోని మర్రిగూడెం గ్రామపంచాయతీలో తడి మరియు పొడి చెత్త నిర్వహణపై ఆదివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలకు చెత్తను వేర్వేరుగా సేకరించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా మండల పంచాయతీ అధికారి షబ్నా మాట్లాడుతూ తడి చెత్తతో సేంద్రీయ ఎరువులు తయారు చేయవచ్చని, పొడి చెత్తను రీసైక్లింగ్ ద్వారా మళ్లీ ఉపయోగించవచ్చని తెలిపారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఇంటి వద్ద తడి, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలని ప్రజలకు సూచించారు. అదేవిధంగా గ్రామంలో చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా నిర్దిష్ట ప్రదేశాల్లోనే వేయాలని సూచించారు. గ్రామ పరిశుభ్రతను కాపాడడం ద్వారా పర్యావరణాన్ని సంరక్షించవచ్చని తెలిపారు. తడి–పొడి చెత్త వేరు చేయడం వల్ల గ్రామంలో వ్యాధులు వ్యాపించకుండా నివారించవచ్చని వివరించారు. ప్రతి కుటుంబం ఈ కార్యక్రమానికి సహకరించాలని అధికారులు కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ కోంద్రు సృజన, ఉపసర్పంచ్ కాటమరాజు, గ్రామ కార్యదర్శి బాలోజీ, వార్డు సభ్యులు, గ్రామ నాయకులు, అంగన్వాడీ టీచర్లు, డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు. గ్రామ పరిశుభ్రతలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని అధికారులు తెలిపారు.

## మహిళలు నేడు అని రంగాల్లో ముందున్నారు

- జిల్లా విద్యాశాఖ అధికారిణి బి.నాగలక్ష్మి



**భద్రాచలం, మార్చి 8 ,ప్రజాజ్యోతి :** మహిళలు నేడు అని రంగాల్లో ముందున్నారని, ప్రతి మహిళ వారి కుటుంబంలో దైవ శక్తితో సమానమని,లింగ వివక్షను రూపమాపి, సమాజంలో మహిళలకు సమాన హక్కులు కల్పించాలని జిల్లా విద్యాశాఖ అధికారిణి బి.నాగలక్ష్మి అన్నారు. భద్రాచలంలో ఆదివారం ఏటిపి ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగలక్ష్మి మాట్లాడుతూ ,కుటుంబం కోసం, సమాజం కోసం మహిళలు చేసే కృషిని గుర్తించి వారిని అభినందించాలనీ,మహిళా సాధికారత మరియు వారి భద్రతపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమం ఏటిపి రాష్ట్ర అధ్యక్షులు కల్లూరి జయ బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి యన్ సత్యనారాయణ, మండల విద్యాశాఖ అధికారులు సున్నం సమ్మయ్య , కొమరం నాగయ్య, ఏటిపి రాష్ట్ర మహిళా కార్యదర్శి మర్మం వరలక్ష్మి దేవి, పద్మా, యస్.సావిత్రి, కారం విజయలక్ష్మి, కాక కృష్ణ వేణి, సోడి శ్రీదేవి, నర్సమ్మ, హిందులత, సత్యవతి, సరోజినీ, పార్వతి,తిరుమల కుమారి తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఐటీడీఏ కార్యాలయంలో గిరిజన దర్బార్



**భద్రాచలం, మార్చి 08,ప్రజాజ్యోతి :** భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో మార్చి 9వ తేదీ సోమవారం నిర్వహించనున్న గిరిజన దర్బార్ కార్యక్రమానికి అన్ని శాఖల ఐటీడీఏ యూనిట్ అధికారులు సకాలంలో హాజరుకావాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.గిరిజనులు తమ సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వకంగా ఫిర్యాదులను సమర్పించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వచ్చిన సమస్యలను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అందువల్ల సంబంధిత యూనిట్ అధికారులు ఉదయం 10 గంటల 30 నిమిషాలకు ఐటీడీఏ సమావేశ మందిరంలో తప్పనిసరిగా హాజరుకావాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ తెలిపారు.

## భద్రాచలం తహశీల్దార్ కార్యాలయంలో నేడు ప్రజావాణి కార్యక్రమం



**భద్రాచలం, మార్చి 08,ప్రజాజ్యోతి :** భద్రాచలం మండల ప్రజలకు సోమవారం ఉదయం 10 గంటల 30 నిమిషాల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు భద్రాచలం తహశీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహశీల్దార్ ధనియాల వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి అన్ని శాఖల మండలాధికారులు హాజరుకానున్నారని ఆయన తెలిపారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు సమర్పించవచ్చని, వాటిని స్వీకరించి పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. అందువల్ల మండలంలోని ప్రజలు తప్పనిసరిగా ఈ ప్రజావాణి కార్యక్రమానికి హాజరై తమ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను సమర్పించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ ధనియాల వెంకటేశ్వర్లు కోరారు

## భద్రాద్రి మిల్లెట్ బిస్కెట్ల సభ్యురాలు వెంకట్ లక్ష్మికి ఘన సన్మానం





**భద్రాచలం, మార్చి 08,ప్రజాజ్యోతి :** గత సంవత్సరం జూన్ నెలలో భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ భద్రాచలం ఐటీడీఏ ఆధ్వర్యంలో గిరిజన మహిళలు తయారు చేస్తున్న మిల్లెట్ బిస్కెట్లు మరియు ఇతర పౌష్టికాహార పదార్థాలను 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ప్రశంసించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ సంవత్సరం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని కొమరం భీమ్ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి మిల్లెట్ బిస్కెట్ల తయారీలో భాగస్వామ్యమైన సభ్యురాలు వెంకట్ లక్ష్మి ని ఘనంగా సన్మానించారు.

# సంత్ సేవాలాల్ బోధనలు మానవాళికి ఆదర్శం: ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి ,మార్చి 8,ప్రజాజ్యోతి :** సంత్ సేవాలాల్ బోధనలు సర్వమానవాళికి ఆదర్శమని, ఆయన చూపిన మార్గాన్ని అనుసరిస్తూ ప్రతి ఒక్కరూ సమాజ సేవకు అంకితం కావాలని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆదివారం జిల్లా కలెక్టర్ కార్యాలయం సమీపంలోని మైదానంలో లంబాడా గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముందుగా సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఉన్న మూఢనమ్మకాలను తొలగిస్తూ మత సామరస్యం, అహింసను



ప్రబోధించిన గొప్ప సంస్కర్త సంత్ సేవాలాల్ అని కొనియాడారు. అహింసా మార్గంలో నడవాలని ఆయన ఇచ్చిన సందేశం సమాజానికి మార్గదర్శకమని పేర్కొన్నారు. ప్రకృతిని ప్రేమిస్తూ అడవులను సంరక్షించుకుంటూ జీవించే గిరిజన సంస్కృతికి సేవాలాల్ మహారాజ్ దిక్సూచిగా నిలిచారని అన్నారు. తండాల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు గిరిజనుల భూమి, సాగు హక్కుల పరిరక్షణ కోసం తాము నిరంతరం పోరాడుతామని హామీ ఇచ్చారు. గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్యం మెరుగుపడేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. అడవి బిడ్డల జీవన ప్రమాణాలు మెరుగుపడినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కే. సాబీర్ పాషా, కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, తహసీల్దార్లు పుల్లయ్య, కృష్ణప్రసాద్, పీ. కృష్ణ, దారా ప్రసాద్, డీటీ అంజద్, నాయకులు భూక్యా దస్రు, లక్ష్మణ్ నాయక్, శాపావత్ రవి, జర్పుల ఉపేందర్, వీరు నాయక్, హత్తిరామ్, రమేష్ రాథోడ్, జుంకి లాల్, రమేష్ నాయక్, లావుద్య ప్రసాద్, పూర్ణ, హరిలాల్ తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు





**ఇల్లందు, మార్చి 8, ప్రజాజ్యోతి:** వాసవి క్లబ్, వనిత క్రౌన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం స్థానిక కళాసి బస్తీలో గల ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. మహిళలు ఆట, పాటలు, డాన్స్ లతో మహిళలు ఉత్సాహంగా నడిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వివెన్ ప్రోగ్రాం గోల్డెన్ స్టార్, కేసిజియఫ్ చారుగుళ్ల శ్రీనివాసరావు హాజరై మాట్లాడుతూ కన్న తల్లిగా లాలిస్తారని, కంటికి రెప్పలా రక్షిస్తారని, కల్మషం లేని ప్రేమను అందిస్తావని ఓ తల్లీ నీకు వందనం" అంటూ మహిళల గొప్పతనాన్ని కొనియాడారు. మహిళా రైతు మందా సూరమ్మ, ప్రముఖ వైద్యులు డాక్టర్ కల్పన, డాక్టర్ అయితా మాధురి, డాక్టర్ పసుమర్తి సాయి చరిష్మా, ఉపాధ్యాయురాలు సముద్రాల కళ్యాణి తదితర మహిళలను సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నందుకు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వనిత క్రౌన్ అధ్యక్షురాలు కటకం అలేఖ్య, ప్రధాన కార్యదర్శి రాచర్ల వాణి, కోశాధికారి సముద్రాల ఉషారాణి, వి.ఎన్ సిల్వర్ స్టార్ కేసీజీఫ్ యర్రం సుజాత, కో–చైర్మన్ వి.ఎన్ కేసీజీఫ్ గుండా లక్ష్మీ సింధూర, ఐఈసీ ఆఫీసర్ చిదిరాల లింగయ్య, ఐపీసీ ఆఫీసర్ వ్యామసాని జనార్ధన్, రీజియన్ చైర్ పర్సన్ దూపకుంట్ల అనిల్ కుమార్, రీజియన్ సెక్రటరీ దూపకుంట్ల అలేఖ్య, జోన్ చైర్మన్ బోనగిరి రవి కిరణ్, జాయింట్ సెక్రటరీ జొన్నల ఉపేంద్రనాథ్ గుప్తా, వాసవి క్లబ్ ఇల్లందు అధ్యక్షుడు కటకం సత్యేంద్ర కుమార్, ప్రధాన కార్యదర్శి తీర్థాల నాగరాజు, కోశాధికారి బోనగిరి రమేష్, వనిత క్రౌన్ గౌరవ సలహాదారులు అర్వపల్లి విజయలక్ష్మి , యెలుగురి జయశ్రీ, పుల్లూరు జ్యోతి, సైఫా కళ్యాణి, బోనగిరి కల్పన, మహిళలు పాల్గొన్నారు.

## భద్రాచలంలో 'నాదోపాసన' సంగీత కచేరీలు

- **ఈ నెల 15న ప్రత్యేక కార్యక్రమాలు**

**భద్రాచలం, మార్చి 08,ప్రజాజ్యోతి :** ఈ నెల 15వ తేదీ ఆదివారం నిర్వహించే నదీహారతి కార్యక్రమం సందర్భంగా ఐటీసీ సారపాక, కళ్యాణి గ్రూప్ (భారత్ ఫోర్జ్ లిమిటెడ్), పూణే మరియు స్థానిక అధికారుల సహకారంతో "నాదోపాసన" దేవాలయ ఆధారిత సంగీత కచేరీల పునరుద్ధరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు హైదరాబాద్‌కు చెందిన శ్రీ వాగ్దేవి కళా సమితి ప్రతినిధి నెల్లుట్ల శ్రవణ్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సాయంత్రం 5:30 గంటలకు డాక్టర్ శ్రీమతి సింధుజ ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించబడుతుంది. అనంతరం సాయంత్రం 6:00 గంటలకు గోదావరి నదీహారతి కార్యక్రమం జరుగుతుంది. రాత్రి 7:00 గంటలకు ప్రముఖ కళాకారిణులు "ప్రియా సిస్టర్స్"గా ప్రసిద్ధి చెందిన విద్వాంసులు శ్రీమతి షణ్ముఖ ప్రియా, శ్రీమతి హరి ప్రియలచే కర్ణాటక సంగీత కచేరి నిర్వహించనున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ ఆధ్యాత్మిక–సాంస్కృతిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

